క్లుప్తంగా

మీడియా ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్‌లో వీకెండ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డబ్బింగ్ (రెండు నెలలు), విజువల్ ఆర్ట్స్(ఆరు నెలలు) ఫైన్ ఆర్ట్స్ వీకెండ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఉషాజ్యోతి మణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 97013 27539, 94417 68811 నంబర్లలో సంప్రదించాలన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


మఠంలోని శారదాంబ మూలవిరాట్

నల్లకుంట : నల్లకుంట శంకర మఠంలో ఈ నెల 15 నుంచి 24వ తేది వరకు శ్రీ శారదా శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు శంకరమఠం నల్లకుంట శాఖ హెడ్ కె. కృష్ణారావు తెలిపారు. గురువారం శంకరమఠంలో కృష్ణారావు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల ప్రారంభానికి ముందు రోజు 14వ తేదీన ఉదయం 7 గంటలకు శారదాంబ మూలవిరాట్‌కు మహాభిషేకము ఉంటుందని చెప్పారు. అనంతరం శారదాంబ జగత్ ప్రసూతిక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో..

చిక్కడపల్లి : చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధిగాంచిన అష్టలక్ష్మీదేవాలయంలో 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు దేవాలయం నిర్వాహకులు ఖాజాపూర్ణచంద్ర శర్మ తెలిపారు. గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయడంతోపాటు, ప్రత్యేక పూజ, అభిషేకాలు, గో పూజలు ఘనంగా నిర్వహిస్తామన్నారు.

అలయ్ బలయ్‌కి ఉప రాష్ట్రపతికి ఆహ్వానం



ముషీరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ అక్టోబర్ 25న ఘనంగా నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్కర్‌ను అలయ్ బలయ్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, అలాయ్ బలాయ్ ఫౌండేషన్ ట్రస్టీ సభ్యులు బి.జనార్దన్‌రెడ్డిలు ఆహ్వానించారు. గురువారం న్యూఢిల్లీలోని ఉప రాష్ట్రపతి నివాసంలో కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

వెంకటేష్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ గణితశాస్త్రం విభాగం నుంచి దుడుక వెంకటేష్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సికింద్రాబాద్ పరిధిలోని పార్శిగుట్ట శ్రీనివాస్‌నగర్ నివాసి వెంకటేష్ ఓయూ అధ్యాపకులు ప్రొ.నాగరాజు పర్యవేక్షణలో ఎగ్జిస్టెన్స్ అండ్ యూనిక్ నెస్ ఆఫ్ ఫిక్స్ అండ్ కామన్ ఫిక్స్ పాయింట్ ఫర్ డిఫరెంట్ కాంట్రాక్షన్ ఇన్ వేరియస్ స్పేసెస్ అనే అంశం పై పరిశోధనకు డిగ్రీ అందుకున్నారు. హన్మకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రం విభాగం అధ్యాపకులుగా పనిచేస్తూ హెడ్ పదవీలో కొనసాగుతున్నారు.

ఆటపాటలతో నిరుద్యోగ బతుకమ్మ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థి నిరుద్యోగ బతుకమ్మను ఆటపాటలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థి నిరుద్యోగ అక్కా చెల్లెళ్ల బతుకమ్మకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. బతుకమ్మ పాటలతో ఉద్యోగా ల కల్పనలో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు.

నేడు 'ఎన్నికల సంస్కరణల'పై సెమినార్

లాలాపేట: ప్రకాశం ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సిటీ కళాశాల ఆడిటోరియంలో 'ఎన్నికల సంస్కరణలపై సెమినార్'ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డా. పి. మోహన్‌రావు, టంగుటూరి శ్రీరామ్, రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సెమినార్‌కు మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావు, మాజీ ఆర్టీఐ కమిషనర్ ఆర్. దిలిప్ రెడ్డి, పి.ఉదయభాస్కర్, రచనా జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. ఉమామహేశ్వరరావు హాజరవుతారన్నారు.

బీజేపీ అభ్యర్థి ఎవరో?

ముషీరాబాద్ అభ్యర్థిత్వంపై ఇంకా సందిగ్ధం

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎవరనేదానిపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఇంకా గందరగోళం నెలకొంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటికీ బీజేపీ అభ్యర్థి విషయంలో ఇప్పటి వరకు అధిష్టానం ఓ నిర్ణయానికి రాలేకపోతుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో క్లారిటీ ఉన్నప్పటికీ బీజేపీ శ్రేణుల్లో మాత్రం నైర్యాశం నెలకొని ఉంది. ముషీరాబాద్ అనగానే వెంటనే గుర్తొచ్చే డాక్టర్ కె. లక్ష్మణ్ రాజ్యసభ సభ్యుడిగా, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులుగా, పార్లమెంట్ కమిటి, ఎలక్షన్ సెలక్షన్ కమిటీలో సభ్యులుగా ప్రస్తుతం కీలక బాధ్యతల్లో కొనసాగుతున్నారు. దీంతో ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం లేదని, ఆయన కూడా పోటీకి సిద్ధంగా లేరని ప్రచారం సాగుతుంది. దీంతో ముషీరాబాద్ బీజేపీ టికెట్ కోసం హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి, డాక్టర్ కె.లక్ష్మణ్ సన్నిహితుడు సి.గోపాల్‌రెడ్డి, స్థానిక బీజేపీ రాష్ట్ర నాయకులు సి.కె.శంకర్, కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రియనవీన్‌గౌడ్, పావనీ వినయ్‌కుమార్, భరత్‌గౌడ్ పూస రాజు, సూర్యనారాయణశర్మలతో పాటు 30 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి ఎవరికి వారు టికెట్ కోసం పడరాని పాట్లు పడుతూ జాతీయ నేతల వద్ద అనేక ప్రయత్నాలు సాగిస్తున్నారు.

మౌనం వీడని లక్ష్మణ్...

ఇంత జరుగుతున్న డాక్టర్ కె.లక్ష్మణ్ మాత్రం మౌనం వీడడం లేదు. ఈ దఫా నేను పోటీ చేయడం లేదని నేను పలానా వ్యక్తికి అవకాశం కల్పించాలనుకుంటున్నానని గానీ స్పష్టం చేయడం లేదు. ఆయన ఎవరి వైపు మొగ్గు చూపితే వారికే టికెట్ దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ డాక్టర్ లక్ష్మణ్ ఎటు మొగ్గు చూపుతున్నారని ఎవరికి అర్థం కాక తలలుపట్టుకుంటున్నారు.

నేడు ఆశావహులతో సమావేశం...

శుక్రవారం ముషీరాబాద్ ప్రధాన మార్గంలోని ఆర్యవైశ్య భవన్ హాల్‌లో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావాహులతో పాటు డివిజన్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులతో సమావేశాన్ని మధ్యాహ్నం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీనికి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డితో పాటు డాక్టర్ కె.లక్ష్మణ్ కూడా హాజరు కానున్నారు. ఈ సమావేశంలోనైనా అభ్యర్థి విషయంలో క్లారిటీ వస్తుందా.? అని ఆశిస్తున్నారు.

బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలి

ముషీరాబాద్: బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించాలని, బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరచాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ కోరారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ సీడబ్ల్యూసీ మెంబర్ మధుయాష్కి, వి.హన్మంతరావు, మహేష్‌గౌడ్, మల్లు రవి, టీజేఎస్ అధ్యక్షులు కోదండరామ్, టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బీఎస్‌పీ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ తదితరులను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. జనాభా లెక్కల ప్రకారం 55 శాతానికి పైగా ఉన్న బీసీలకు టికెట్లు కేటాయించాలని, అనంతరం ఏర్పడే మంత్రి వర్గంలో కూడా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.


కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ తదితరులు

కాంగ్రెస్ పార్టీ నుంచి శివకుమార్ రెడ్డిని సస్పెండ్ చేయాలి

కాచిగూడ: ఓ మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరించి నిందితుడిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నేత కుంబం శివకుమార్ రెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బంజారా మహిళా సంఘం అధ్యక్షురాలు ఇందుబాయి, ప్రతినిధులు దేవి, కె.చిట్టి, జే.సోనీ చిట్టి డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. నారాయణపేట డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కంబం శివకుమార్ రెడ్డిని పార్టీ పదవి నుంచి తొలగించారే తప్ప పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదని అన్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో శివకుమార్ రెడ్డిపై కేసు కూడా నమోదైందన్నారు. శివకుమార్ రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అండగా ఉన్నందు వల్లనే పోలీసులు చర్యలు తీసుకోలేక పోతున్నారని వారు ఆరోపించారు.

పార్టీలు పర్యావరణ పాలసీ మేనిఫెస్టోలో చేర్చాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజకీయ పార్టీలు పర్యావరణ పాలసీని తమ మేనిఫెస్టోలో చేర్చాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలు తమ ఓటు బ్యాంకు ఆలోచనతో పర్యావరణ పట్ల తీవ్ర ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. దీంతో నిరంతరం పర్యావరణం ధ్వంసం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రీ అట్రాసిటీ చట్టం, బడ్జెట్‌లో 5 శాతం నిధులు, సేంద్రీయ వ్యవసాయానికి ప్రత్యేక నిధులు, వ్యవసాయ భూములను నిర్వీర్యం చేసే రసాయన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకొనే హామీ తదితరాలు మ్యానిఫెస్టోలో స్థానం కల్పించే పార్టీలనే ఆదరిస్తామని స్పష్టం చేశారు.

భారత వ్యవసాయ రంగానికి దశ దిశ చూపిన స్వామినాథన్


సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

ముషీరాబాద్: భారత వ్యవసాయ రంగానికి దశ దిశ చూపిన వ్యక్తి ఎంఎస్ స్వామినాథన్ అని ప్రముఖ వ్యవసాయ శాస్త్ర వేత్త ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. గురువారం దోమలగూడలోని ఏవీ కళాశాలలో ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అల్దార్ జానయ్య మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో ప్రపంచంలోనే అతికొద్ది మంది సైంటిస్ట్‌లలో అగ్రభాగాన నిలిచిన ఏకైక సైంటిస్ట్ ఎంఎస్‌స్వామినాథన్ అన్నారు. ప్రతి విద్యార్థి స్వామినాథన్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రాజా మాట్లాడుతూ.... స్వామినాథన్ జీవితాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏవీ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. పద్మ, అధ్యాపకులు చంద్రశేఖర్ రెడ్డి, నగేష్, జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి ఎస్ లింగస్వామి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను విస్మరించిన దానం నాగేందర్

కాచిగూడ: దానం నాగేందర్ ఎమ్మెల్యే అయిన తరువాత ప్రజా సమస్యలను పట్టించుకోలేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను విస్మరించిన దానం ఎన్నో ఘన కార్యాలు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కేశబోయిన శ్రీధర్, పందిల్ల ప్రసాద్, నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో అగ్నిప్రమాదం

కాచిగూడ: హిమాయత్‌నగర్ తిరుమల ఎస్టేట్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. రెండవ అంతస్తులో ఉన్న ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ సర్వర్ రూమ్‌లో షాట్ సర్క్యూట్ జరగడంతో అగ్నిప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. షాట్ సర్క్యూట్ జరగడంతో కంపెనీలో పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. ప్రమాదంలో కంప్యూటర్లు కాలిపోయాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రైలులో రూ.95వేలు చోరీ

కాచిగూడ: నగదు బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు గురువారం జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన మేరకు.. సోమాజిగూడ ప్రాంతానికి చెందిన రాజేష్ తన భార్యతో కలిసి లాల్‌ఘడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నారు. నిజామాబాద్ – కామారెడ్డి రైల్వే స్టేషన్ల మధ్యన ఉండగా రూ.95వేల నగదు, దుబాయ్ కరెన్సీ ఉన్న బాగ్యగు చోరీకి గురైంది. బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే పార్టీలకే మద్దతు

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసే పార్టీలకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్ కుమార్ అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో 119 అసెంబ్లీ స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ ,బీసీ,మైనార్టీలు అధిక సంఖ్యలో ఉన్నారని, అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేయగలిగే సత్తా తమకు ఉందని అన్నారు. త్వరలో రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం నిర్వహించి అన్ని సమాజిక వర్గాల అభిప్రాయం సేకరించి ఏ పార్టీకి మద్దతు ఇస్తామనే విషయం ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించాలి


ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉగ్గే శ్రీనివాస్ పటేల్

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి వెంటనే తొలగించి మున్నూరుకాపులకు అప్పగించాలని మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపుల సమస్యలపై మున్నూరుకాపు భవన్ లోపల మాట్లాడేందుకు హాస్టల్ ట్రస్ట్ బోర్డు అనుమతించలేదని ఆరోపించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మున్నూరుకాపు హాస్టల్ భవన్ గేటు ముందు మాట్లాడాల్సిన దుస్థితి కల్పించారని, హాస్టల్ ట్రస్ట్‌బోర్డు వారు తమ స్వంత జాగీరుగా వ్యవహరిస్తూ మున్నూరుకాపులను లోనికి రాకుండా గేట్లకు తాళాలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో అల్లం కిషన్‌రావు, బిల్లకంటి శ్రీనివాస్, ఆకుల శశికాంత్, వెంపటి సోమయ్య, బత్తుల రాములు, పోట్ల రవి, ఎనుగుల నరేష్ పటేల్, కిష్టంగారి ప్రకాష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



అంబర్‌పేట: పేద విద్యార్థులకు చేయూతనిచ్చి వారి విద్యాభ్యున్నతికి చొరవ తీసుకోవాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం డివిజన్‌లోని మల్లికార్జున నగర్ ప్రభుత్వ పాఠశాలలో విజయం స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి నోట్ పుస్తకాలు అందించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచాలి

అంబర్‌పేట్: చదువులతో పాటు విద్యార్థులకు క్రీడల్లో రాణించేలా విద్యా సంస్థలు ప్రోత్సహించాలని ఎయిర్‌ఫోర్స్ వింగ్ రిటైర్డ్ కమాండర్ జి.శ్రీనివాస్ సూచించారు. ఇటీవల బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన క్రీడా పోటీల్లో డీడీ కాలనీ అకాడమిక్ హైట్స్ పాఠశాల విద్యార్థులు పలు క్రీడల్లో విజేతలుగా నిలిచారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి రిటైర్డ్ కామెండర్ శ్రీనివాస్ విచ్చేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, రూప రెడ్డి, కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, పీఈటీలు విజయ్, జలంధర్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఎయిర్ ఫోర్స్ రిటైర్డ్ కామెండర్ జి.శ్రీనివాస్

10 లక్షల మందితో ఢిల్లీలో ఆందోళన చేస్తాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓబీసీ నేషనల్ జేఏసీ చైర్మన్ మహేష్ యదవ్

కాచిగూడ: జాతీయ స్థాయిలో ఓబీసీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై అన్ని రాష్ట్రాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి త్వరలో పది లక్షల మందితో ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఓబీసీ నేషనల్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రకటించింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ చైర్మన్ మహేష్ యాదవ్, కన్వీనర్ విజిఆర్ నారగోని, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ మాట్లాడుతూ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని, స్థానిక సంస్థల్లో ఓబీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే చేయించారని, ఆ సర్వే నివేదికను బయట పెట్టకుండా నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు.

దాతల సహకారం మరువలేనిది



రాంగోపాల్‌పేట్: నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక డిజిటల్ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయులు చిన్నా బత్తిని శౌరి అన్నారు. గురువారం పాఠశాలలో సనాతన్ ట్రస్టు ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్టీ ఎస్వీ సుబ్రహ్మణ్యం సతీమణి పద్మశ్రీ సంస్మరణార్థం 350 మంది విద్యార్థులకు ఉచితంగా బూట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో మంచుకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిజిటల్ తరగతి గదులు, ఫర్నిచర్, పుస్తకాలు తదితర సామగ్రి అందించి ఎంతో సహకరించారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు కాన్వెంట్లకు తీసిపోకుండా అత్యుత్తమ ఆంగ్ల విద్యా బోధన చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఒకటవ తరగతి విద్యార్థి ఆంగ్లంలో వినిపించిన ప్లెడ్జ్, మరో విద్యార్థి జైలోఫోన్ ఇన్‌స్ట్రుమెంట్ ద్వారా ప్రదర్శించిన సంగీతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సుబ్రహ్మణ్యం, సందెపూడి సత్యనారాయణ, డాక్టర్ బాలా త్రిపుర సుందరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో ఎమ్మెల్యే అన్యాయం చేశారు


ఎడ్ల సుధాకర్‌రెడ్డి నివాసం వద్ద ఫిర్యాదు చేస్తున్న మహిళాలు

అంబర్‌పేట: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, సంక్షేమ పథకాల అమలులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్యాయం చేశారంటూ పలువురు మహిళాలు వాపోయారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎడ్ల సుధాకర్‌రెడ్డి నివాసానికి వచ్చి ఎమ్మెల్యే తమకు సంక్షేమ పథకాలు రాకుండా చేశాడని గురువారం పేర్కొన్నారు. సంక్షేమా పథకాల్లో ఎమ్మెల్యే అనుచరులు డబ్బులు ఇచ్చిన వారికే లబ్ధి చేకూర్చరంటు తీవ్ర ఆరోపణలు చేశారు.

సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలి


బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో గురువారం జరిగిన బూత్ స్వశక్తికరణ్ సమావేశంలో బూత్ స్థాయిలో పార్టీ పనితీరు గురించి పదాధికారుల నుండి వివరాలు తీసుకున్నారు. పార్టీ గెలవాలంటే మొదటి మనకు బూత్ స్థాయిలో చాలా కష్టపడాలని గౌతంరావు సూచించారు. పార్టీ నేతలు కృష్ణగౌడ్, సందీప్ సాయి తదితరులు పాల్గొన్నారు.

తవ్విన రోడ్డుతో జనం అవస్థలు

అంబర్‌పేట్: తవ్విన రోడ్‌తో స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పైపులైన్ కోసం తవ్వి నెలల తరబడి పూర్తి చేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ ప్రాథమిక ఆసుపత్రి ఎదురుగా ఉన్నా లైన్‌లో పైపులైన్ కోసం తవ్వకాలు చేపట్టరు చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో స్థానిక నివాసితులు నిత్యం అసౌకర్యానికి గురవుతున్నారు. చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రంగం తక్షణమే స్పందించి చేపట్టిన పైపులైన్ పనులను పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


బాగ్ అంబర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా నిలిచిపోయిన పైపులైన్ పనులు

ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుకన్య బతుకమ్మ పండుగ సంస్కృతి, విశేషాలను వివరించారు. ఎంపవర్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ జె.భారతీ సూచనల మేరకు కళాశాల అన్ని విభాగాల నుంచి పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చి అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో ఎస్.నిర్మల, డాక్టర్ కె.నిర్మల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో...

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బతుకమ్మ ఆటలు ఆడి పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐవోఎస్ ప్రేమిళ రాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా మహిళలందరు ఐక్యంగా నిర్వహించుకునే పండుగ ఈ బతుకమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో సెయింట్ ఆడమ్స్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: ముషీరాబాద్ రేడియెంట్ హైస్కూల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ పాల్గొన్నారు. హెచ్ఎం సయ్యద్ అహ్మద్ భక్తియార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో బతుకమ్మ ఆడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో..


వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సంక్షేమ పథకాలపై అవగాహన ఉండాలి

లాలాపేట: యాక్షనైడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం తార్నాక డివిజన్ లాలాపేట ఇందిరానగర్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ హైదరాబాద్ ఇన్‌చార్జి చెవ్వం రఘుపతిరావు హాజరై మాట్లాడుతూ.. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వాలు కల్పిస్తున్న విద్యా సంస్థల్లో చేరి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. యాక్షనైడ్ సంస్థ ఆధ్వర్యంలో గత కరోనా కాలంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. స్థానిక బస్తీల నాయకులు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగేశ్వర్‌రావు, కూరెల్లి నాగరాజు గౌడ్, పర్మేష్, జునైద్, కళ్యాణి పాల్గొన్నారు.

వాల్మీకుల సమస్యలను పరిష్కరించాలి

లిబర్టీ: వాల్మీకుల సమస్యలను పరిష్కరించాలని ఎంఐఎం జాతీయ అధ్యక్షులు, లోకసభ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీకి వాల్మీకి సమాజ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రీతంసింగ్ గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. సాంప్రదాయ వృత్తిని నమ్ముకుని వాల్మీకులు పని చేస్తున్నారని ఆర్థిక, సామాజిక వర్గం తీవ్ర వెనుకబాటులో ఉన్నారని వాల్మీకులను దళిత బంధు పథకాన్ని వర్తింపజేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ముగియగానే వాల్మీకుల సమస్యపై సీఎంతో చర్చిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383